క్లుప్తంగా

నేడు వ్యవసాయ శాఖ మంత్రి కాకాని రాక

నల్లజర్ల: మండలంలోని అయ్యవరం గ్రామంలో 3 ఎఫ్ ఆయిల్ పామ్ సంస్థ కొత్తగా ఏర్పాటు చేయబోయే ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు బుధవారం భూమి పూజ చేసే కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పాల్గొనున్నారు.ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, గోపాలపురం ఎమ్మెల్యే తలారివెంకట్రావు హాజరు కానున్నారు.

సెంట్రింగ్ సామగ్రి చోరీపై కేసు నమోదు

కొవ్వూరు: పట్టణంలోని ఆవుల వారి వీధిలోని ఓ ఇంట్లో భవన నిర్మాణాల్లో శ్లాబ్ వేసేందుకు వినియోగించే సెంట్రింగ్ సామగ్రి చోరీకి గురైంది. దీనిపై వాటి యజయాని మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. తామందరం సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మరొక గదిలో దాచి ఉంచిన సెంట్రింగ్ సామాన్లను గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయినట్టు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దుండగులు తాళాలు పగలు గొట్టి గదిలోకి ప్రవేశించినట్టు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

16న కుల గణనపై నిడదవోలులో అవగాహన సదస్సు

కొవ్వూరు: కుల జన గణనపై ఈనెల 16న నిడదవోలులో నిర్వహించే అవగాహన సదస్సుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా హాజరు కావాలని డీసీసీ అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారి కోరారు. కొవ్వూరు ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కులగణన సక్రమంగా కొనసాగితే ఆయా కులాల నిష్పత్తి ప్రకారం న్యాయం చేకూరుతుందన్నారు.ఈ సదస్సుకు రాష్ట్ర మాజీ మంత్రి రఘువీరారెడ్డి, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రి పళ్లం రాజు హాజరు కానున్నట్లు వివరించారు.

రైళ్లను పునరుద్ధరించాలని ఎంపీకి వినతి



రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు: కరోనా సమయంలో కొన్ని రైళ్లకు కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో హాల్టలను రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం కొవ్వూరు విచ్చేసిన రాజ్యసభ సభ్యుడు కోడూరి విజయేంద్ర ప్రసాద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎంపీ ఈ సమస్యపై సానుకూలంగా స్పందించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు బోడపాటి ముత్యాలరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, పిక్కి నాగేంద్ర, కొండపల్లి రత్న సాయి, చెరుకూరి సాయిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఉండ్రాజవరం: ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు, ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు తాటిపాక మధు ప్రభుత్వాన్ని కోరారు. ఏఐటీయూసీకి అనుబంధంగా మంగళవారం వడ్లూరులో శ్రీరామాంజనేయ ఆటో వర్కర్స్ యూనియన్ నూతన శాఖ ఏర్పడింది. ఏఐటీయుసీ పతాకాన్ని తాటిపాక మధు ఆవిష్కరించారు. యూనియన్ బోర్డును సర్పంచ్ రఘుమండ తేజశ్రీ శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, ఎంపీటీసీ సభ్యుడు వేంద్ర రమేష్, ఏఐటీయూసీ నేత పీఎస్ నారాయణ ఆవిష్కరించారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' పై పెద్దేవంలో అవగాహన

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు పలు సూచనలు చేశారు. గ్రామంలో ఈ నెల 9న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కాపు జేఏసీ నాయకుడు తోట రామకృష్ణ కూడా మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్నను, హోం మంత్రి తానేటి వనితను అత్యధిక మెజార్టీతో మళ్లీ గెలిపించాలన్నారు. ఈవోపీఆర్డీ కేఎస్ వీరన్న, పంచాయతీ కార్యదర్శి అలేఖ్య సువర్చల, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

చాగల్లు: కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చాగల్లు మెయిన్ సెంటర్లో రైతులు నిరసన తెలిపారు. జిల్లా రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటం ప్రారంభించి వెయ్యి రోజులైన సందర్భంగా ఈ నిరసన తెలిపామన్నారు.

వ్యాయామ విద్య.. ప్రోత్సాహం లెస్స

- అన్ని పాఠశాలలకూ క్రీడా పరికరాలు
- స్థాయిని బట్టి ప్రాథమికకు 9, యూపీకి 15, హైస్కూళ్లకు 17 రకాలు
- తొలిసారిగా పీడీ, పీఈటీలకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

నల్లజర్ల: పాఠశాలల్లో క్రీడలు, వ్యాయామ విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను కూడా ఒక సబ్జెక్ట్‌గా పరిగణించాలని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు క్రీడా సామగ్రిని సరఫరా చేసి క్రీడలను ప్రోత్సహిస్తోంది. గతంలో క్రీడా పరికరాల కోసం తూతూమంత్రంగా పాఠశాలలకు రూ.500, రూ.1000 చొప్పున మంజూరు చేసేవారు. ఇపుడు వేలాది రుపాయలు ఖర్చు చేసి నాణ్యమైన క్రీడా సామగ్రిని పాఠశాలలకు అందించారు.

సరఫరా చేసిన క్రీడా పరికరాలు

ప్రాథమిక పాఠశాలలకు ఉడెన్ క్రికెట్ బ్యాట్, వికెట్స్ సెట్, టెన్నిస్ బాల్, హ్యాండ్ బాల్, ఫ్రిస్బీ, మల్టీకలర్ హోలా హూప్స్, స్టెప్ హార్డిల్స్, స్కిప్పింగ్ రోప్.

ప్రాథమికోన్నత పాఠశాలలకు..

వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాస్కెట్ బాల్, టెన్నికాయిట్ రింగ్, టెన్నికాయిట్ నెట్, స్కిప్పింగ్ రోప్స్, చెస్ సెట్, వేయింగ్ మెషీన్, షాట్‌పుట్, డిస్కస్ రబ్బర్, కోన్స్‌మార్కులగ్, స్టెప్ హార్డిస్, ఫ్రిస్బీ.

ఉన్నత పాఠశాలలకు..

వాలీబాల్స్, వాలీబాల్ నెట్, త్రోబాల్స్, త్రోబాల్ నెట్, హ్యాండ్ బాల్స్, టెన్నికాయిట్స్, టెన్నికాయిట్ నెట్, స్కిప్పింగ్ రోప్స్, యోగా మ్యాట్స్, చెస్ సెట్, ఫుట్ ఎయిర్ పంప్, ఫుట్‌బాల్, వేయింగ్ మెషీన్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, మెజరింగ్ టేప్, యోగా మ్యాప్, ఫుట్‌పంప్.

పరికరాల కోసం..

క్రీడా పరికరాల సరఫరా కోసం ఒక్కో ప్రాథమిక పాఠశాలకు రూ.3,400, యూపీ పాఠశాలలకు రూ.7,800, ఉన్నత పాఠశాలలకు రూ.17,700 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేసింది. విద్యా వ్యవస్థలో ఇప్పటి వరకూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు కేవలం సబ్జెక్ట్ టీచర్లకు మాత్రమే జరిగేవి. ఈ సారి పీడీలకు, పీఈటీలకు కూడా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ కేంద్రంగా ఒక కాంప్లెక్స్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గత నెలలో పీడీలకు, పీఈటీలకు కూడా కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. వ్యాయామ విద్యకు పెద్దపీట వేసి తమకు శిక్షణ ఇవ్వడం శుభ పరిణామమని పీడీలు, పీఈటీలు చెబుతున్నారు.



ఉన్నత పాఠశాలలకు సరఫరా చేసిన క్రీడా పరికరాలు

ఎన్నడూ లేని విధంగా..



గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని పాఠశాలల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం క్రీడా సామగ్రి అందజేసింది. ప్రతి పాఠశాలకు క్రీడా పరికరాలు అందించిన ప్రభుత్వానికి పీడీలు, పీఈటీల తరపున కృతజ్ఞతలు.రాష్ట్ర స్థాయి క్రీడలలో పాల్గొనేందుకు క్రీడాకారులకు మంచి తర్ఫీదు ఇవ్వగలుగుతాం.

– పల్లి వెంకట అప్పారావు, పీడీ, మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్, తూర్పు చోడవరం

నాణ్యంగా ఉన్నాయి



విద్యార్థుల కోసం ప్రభుత్వం అందజేసిన క్రీడా పరికరాలు చాలా నాణ్యంగా ఉన్నాయి. రాష్ట్ర అధికారులు నేరుగా మండల విద్యావనరుల కేంద్రానికి వాటిని అప్పగించగా, వారు ఆయా పాఠశాలలకు అప్పగించారు. పీడీ, పీఈటీలకు ఎన్నడూ లేని విధంగా స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేశారు.గోపాలపురం నియోజకవర్గానికి దేవరపల్లి మండలం రామన్నపాలెంలో ఏర్పాటు చేశారు.

– తూంపాటి త్రిపుర స్వాతి, పీడీ, నల్లజర్ల

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

తాళ్లపూడి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మంగళవారం మండలంలో పర్యటించారు. అన్నదేవరపేట, తాళ్లపూడి, గజ్జరం జెడ్పీ ఉన్నత పాఠశాలలకు వెళ్లి అక్కడి ఉపాధ్యాయులతో ఆయన సమావేశం అయ్యారు.117వ నంబర్ జీవోను, సీపీఎస్‌ను జీపీఎస్‌ను రద్దు చేయించి, ఓపీఎస్‌ను తీసుకు రావాలని ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తెచ్చారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ, ఎరియర్స్‌ను పీఎఫ్ ఏపీజీఎల్ఐ లోన్‌ను ప్రభుత్వం చెల్లించేలా కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులపై వర్క్ లోడ్ తగ్గించేందుకు, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బి.విజయబాబు, మనోజ్, సీహెచ్ శ్రీనివాస్, టి. క్రాంతి కుమార్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడి చేసిన ముగ్గురి అరెస్టు

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి వినాయకుడి ఆలయం వద్ద ఇటీవల జరిగిన అన్న సమారాధనలో వడ్డిస్తున్న వారిపై దాడి చేసిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్టు ఎస్సై కె.రామారావు తెలిపారు. వారు ముగ్గురూ అకారణంగా పాలంగికి చెందిన మేడూరి మధుకుమార్, మంకు దుర్గారావు, దొడ్డా సూర్యనారాయణలతో గొడవ పడి దాడి చేశారు. ఈ ఘటనలో నిందితులైన తణుకులోని టి.వేమవరానికి చెందిన పాల సంతోష్‌కుమార్, కేతా మణికంఠ, బండి వెంకటకృష్ణలను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం తణుకు కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్సై తెలిపారు.

అన్నదాతకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- రైతులకు నమూనా చెక్ అందజేత
- నియోజకవర్గంలో 22,548 మందికి రూ.9.53 కోట్ల లబ్ధి



సమిశ్రగూడెంలో రైతులకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



కరిచర్లగూడెంలో రైతు భరోసా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నిడదవోలు రూరల్: అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వైఎస్సార్ రైతు భరోసా నియోజకవర్గ స్థాయి రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం సమిశ్రగూడెం గీతా మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. విత్తు నుంచి పంట చేతి కొచ్చేంత వరకూ వివిధ దశల్లో రైతులకు ఉపయోగపడేలా విడతల వారీగా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు. వరుసగా ఐదో ఏడాది 2023–24 సంవత్సరానికి సంబంధించి నియోజకవర్గంలో 22,548 మంది రైతులకు రెండో విడత రూ.9.53 కోట్ల ఆర్థిక సహాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. వివిధ పథకాల ద్వారా వ్యవసాయ రంగానికి ప్రభుత్వం రూ.200 కోట్లు ఖర్చు చేసిందన్నారు. రైతు భరోసా ద్వారా ఐదేళ్లలో రూ.143 కోట్ల మేర రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. ప్రతి రైతూ రూ.65,500 లబ్ధి పొందారని, అన్నదాతకు అండగా ఉండే సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని కోరారు. అనంతరం రైతులకు నమూనా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, వైఎస్సార్ సీపీ నిడదవోలు, పెరవలి మండల శాఖల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, వీరమళ్ల సత్యనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సొసైటీ అధ్యక్షులు గజ్జరపు రమేష్, యాళ్ల రామారావు, రైతు సలహామండలి మండలశాఖ అధ్యక్షుడు కస్తూరి సాగర్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గోపాలపురం నియోజకవర్గంలో..

గోపాలపురం: వైఎస్సార్ రైతు భరోసా గోపాలపురం నియోజకవర్గ స్థాయి నమూనా చెక్కును ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మంగళవారం రైతులకు అందజేశారు. మండలంలోని కరిచర్లగూడెం సచివాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 39,180 మంది లబ్ధిదారులకు రూ.15,71,43,000 నమూనా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ పఠాన్ అన్సర్‌బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌కే ఖాదర్‌వల్లీ, ఏఓ బి.రాజారావు, తహసీల్దార్ బి.రవీంద్రనాథ్, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

యాదవోలు–ఆరిపాటి రోడ్డుకు శంకుస్థాపన



యాదవోలు–ఆరిపాటిదిబ్బలు రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: మండలంలోని యాదవోలు నుంచి కొయ్యలగూడెం మండలం ఆరిపాటిదిబ్బల వరకూ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ ఈ రహదారి రెండు మండలాల ప్రజలకు, రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) నిధులు రూ.75 లక్షలు, జిల్లా పరిషత్ నిధులు రూ.75 లక్షల వ్యయంతో ఈ రోడ్డును, కల్వర్టును నిర్మిస్తున్నట్టు వివరించారు. యాదవోలు దుర్గమ్మ గుడి నుంచి పాపయ్య కాలువ వరకు రూ.45 లక్షల వ్యయంతో సుమారు 1.5 కిలోమీటర్ల పొడవునా సీసీ రోడ్డు, పాపయ్య కాలువ నుంచి ఆరిపాటిదిబ్బల వరకూ రూ.75 లక్షల వ్యయంతో సుమారు 3.7 కిలోమీటర్ల పొడవునా డబ్ల్యూబీఎం (మెటల్) రోడ్డు, పాపయ్య కాలువపై రూ.30 లక్షల వ్యయంతో పైపు కల్వర్టు నిర్మిస్తున్నట్టు ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో యాదవోలు సర్పంచ్ సున్నం వరప్రసాద్, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీటీసీ సభ్యులు తమ్మిరెడ్డి నాగప్రసన్న, కొమారపు హారికా జ్యోతి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణ, నియోజకవర్గ అధికారి ప్రతినిధి గడా జగదీష్, మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, మండల యువజన విభాగం అధ్యక్షుడు అనిశెట్టి సూర్యచంద్రం, మైనార్టీ సెల్ మండల శాఖ అధ్యక్షులు ముస్తఫా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సురక్షతో ప్రజారోగ్యానికి రక్ష

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- కరిచర్లగూడెంలో 160 మందికి వైద్యం



కరిచర్లగూడెంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: ప్రజల ఆరోగ్యానికి పూర్తి భద్రత కల్పిస్తూ నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు రోగులకు శ్రీరామరక్షగా మారాయని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని కరిచర్లగూడెం సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు నిత్యం ఆరోగ్యం ఉండాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల ద్వారా అనేక మంది రోగులకు ఉపశమనం కలిగిందన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో సుమారు 160 రోగులకు వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. వారిలో 8 మంది రోగులను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రులకు సిఫార్సు చేసినట్టు అన్నదేవరపేట పీహెచ్‌సీ వైద్యుడు పి సతీష్ తెలిపారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ పఠాన్ అన్సర్‌బాషా, ఎంపీటీసీ సభ్యురాలు కనకదుర్గ, నాయకుల ఎస్‌కె వల్లీ, ఇళ్ళ శ్రీరామమూర్తి, ముక్కాముల నాగేశ్వరరావు, తహసీల్దార్ బి రవీంద్రనాథ్, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి



దొమ్మేరులో మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత, చిత్రంలో ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ తదితరులు



ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

- హోం మంత్రి తానేటి వనిత

దొమ్మేరు, పాలంగి గ్రామాల్లో గడప గడపకూ..

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూర్చారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని దొమ్మేరు–1 సచివాలయం పరిధిలోని దొమ్మేరు సావరం గ్రామంలో మంగళవారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి మంత్రి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ఓట్లేసి ఆశీర్వదించాలని కోరారు. మంత్రి వనత ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, వ్యవసాయ సలహా సంఘం జిల్లా అధ్యక్షుడు బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, సొసైటీ మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, స్థానిక నాయకులు బొల్లిన సతీష్, కొమ్మన మణిబాబు, సర్పంచ్ తానేటి కుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారా యణ, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

ఉండ్రాజవరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని పాలంగి గ్రామంలో రెండో రోజు మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ వేలిచేటి జానకిరామయ్య, పాలంగి సర్పంచ్ బొక్క శ్రీనివాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ సంక్షేమ క్యాలెండర్‌ను రూపొందించి నిర్ణీత సమయంలో పథకాలను ప్రజలకు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమే అన్నారు. పథకాల అమలుతో పాటు ప్రజారోగ్యానికి ప్రత్యేక స్థానం కల్పించారన్నారు. సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు చేస్తోన్న విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రతి గడపలో ప్రజలు తమను ఆదరించి, అభిమానిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, బొక్క శివకుమార్, పాలాటి శరత్‌బాబు, బస్వా ఏసుబాబు, మేశం చిరంజీవి, నేకూరి వీర్రాజు, కాటూరి కుమారస్వామి, జుత్తిగ కిషోర్, బాలం శ్రీనివాసు, నాగులపల్లి నర్సింహమూర్తి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ



సావిత్రి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్‌కృష్ణ

చాగల్లు: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని చంద్రవరం గ్రామంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు గుమ్మడి శైలేంద్రరావు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ శ్రేణులు చిత్తశుద్ధి, సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కాగా పార్టీ నాయకుడు శైలేంద్రరావు భార్య సావిత్రి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబ సభ్యులను రాజీవ్‌కృష్ణ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సావిత్రి చిత్ర పటానికి ఆయన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కొవ్వూరు, చాగల్లు ఎంపీపీలు కాకర్ల నారాయుడు, మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, శ్రీనివాస్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, చంద్రవరం సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి, మాజీ సర్పంచ్ లకంసాని సూర్యప్రకాశరావు, ఉప సర్పంచ్ మేకా రాజు తదితరులు ఉన్నారు.

100 పడకల ఆస్పత్రికి అంకురార్పణ

- మూడు అంతస్తుల భవనానికి త్వరలో టెండర్లు
- ఖరారు కాగానే నిర్మాణానికి శ్రీకారం
- నిడదవోలు ఆసుపత్రిలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



ప్రభుత్వాసుపత్రిలో జనరేటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: స్థానిక ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేసే పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగా 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల మూడు అంతస్తుల నూతన భవనాన్ని నిర్మిస్తామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రకటించారు. త్వరలోనే టెండర్లు పిలిచి, ఖరారు చేశాక, నిర్మాణాలు ప్రారంభిస్తామని చెప్పారు. ఇటీవల నిడదవోలు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ఇక్కడి ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు అంగీకరించారు. ఇందుకోసం ముఖ్యమంత్రి రూ.19 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఆసుపత్రి అప్‌గ్రేడ్ వివరాలను మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు వెల్లడించారు. వంద పడకల ఏరియా ఆసుపత్రి పూర్తయితే బ్లడ్ బ్యాంక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనిక్, ఈఎన్‌టీ, డయాలసిస్ యూనిట్, డెలివరీ విభాగాలు, రెండు ఓటీఎస్, ఎమర్జెన్సీ విభాగం, 22 ఓపీ గదులు అందుబాటులోకి వస్తాయని వివరించారు.

ఇప్పటికే మెరుగైన వైద్యం

టీడీపీ పాలనలో ఈ ఆసుపత్రిలో కేవలం ముగ్గురు వైద్యులు మాత్రమే ఉండేవారని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు గుర్తు చేశారు. ప్రస్తుతం ఎనిమిది మంది వైద్యులు ఇక్కడ రోగులకు సేవలు అందిస్తున్నారన్నారు. గతంలో రోజుకు కేవలం 30 ఓపీ మాత్రమే ఉండేదని, ప్రస్తుతం అది 200కు పెరిగిందన్నారు. సాధారణ వైద్య సేవలతో పాటు ఈ ఆసుపత్రిలో పూర్తిస్థాయి ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. దాంతో ప్రస్తుతం హిమోగ్లోబిన్, లివర్, వైరల్ స్క్రీనింగ్, షుగర్, కిడ్నీ, హెచ్ఐవీ, ఎలక్ట్రోలైట్స్ వంటి పరీక్షలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అలాగే ఫిజియోథెరపీ, ఆక్సిజన్ సరఫరా కేంద్రాన్ని తీసుకు వచ్చామన్నారు. గైనకాలజిస్టు పోస్టు భర్తీ కావడంతో విజయవంతంగా ప్రసూతి ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని చెప్పారు.

జనరేటర్ ప్రారంభం

ప్రభుత్వాసుపత్రికి రూ. 8.50 లక్షలతో సమకూర్చిన జనరేటర్‌ను ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఎస్ తాతారావు, ఏపీఎంఎస్ఐడీసీ ఏఈ రామాంజనేయులు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ మాలరాజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గుర్రం జేమ్స్, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, గుర్రం శాంతిశ్రీ, పువ్వల రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్, ఆకుల ముకుందరావు పాల్గొన్నారు.